గ్యారెంటీలు అమలు చేయాలి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు

పినపాక, జనవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేస్తుందని, అన్ని గ్రామాల్లో గ్యారెంటీలను అమలు చేయాలని పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం ఈ బయ్యారం అడ్డ రోడ్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏం దాచుకోవడానికి దావోస్ వెళ్లారో చెప్పాలని డిమాండ్ చేశారు. పథకాల పేరిట గ్రామసభలు ని ర్వహించి ప్రజలను రేవంత్ సర్కార్ మరోసారి మోసం చేసిందన్నారు. ఇప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధిచెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వమే రావాలని ప్రజ లు కోరుకుంటున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పగడాల సతీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, పీఏసీఎస్ చైర్మన్ రవి వర్మ, నాయకులు భద్రయ్య, భవాని శంకర్, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహారావు, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

ఐటీడీఏ పీవో రాహుల్

కరకగూడెం : అరెంవారిగుంపు గిరిజన పాఠశాల విద్యార్థులతో ముచ్చటిస్తున్న పీవో రాహుల్

కరకగూడెం, జనవరి 28: ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు మంచి బోధన అందించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఐటీడీఏ పీవో రాహుల్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని చిరుమళ్ల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించి విద్యార్థులకు అందుతున్న బోధనపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు స్థానికంగా ఉంటూ మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. అనంతరం అరెంవారి గుంపు గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను సందర్శించిన పీవో విద్యార్థుల ప్రతిభ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఎస్ఆర్పీ రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

పినపాక, జనవరి 28: గిరిజన గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బీ రాహుల్ సిబ్బందిని ఆదేశించారు. ఆయన మంగళవారం మండలంలోని ఐలాపురంలోని మినీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యాబోధన నైపుణ్యాలను అడిగి తెలుసుకున్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. సంక్రాంతి పండుగకు ఇళ్లకు వెళ్లి పాఠశాలలకు రాని విద్యార్థులను పాఠశాలలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి రోజూ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అన్నారు. ఆయన వెంట గురుకుల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్

బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతున్న నాయకులు

కరకగూడెం, జనవరి 28: మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసి గోస పెడుతుందని కరకగూడెం మండల బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రజాపాలన పేరుతో ప్రజలను దగా చేస్తున్నారని, రానున్న పంచాయతీ ఎన్నికల కోసమే ఈ డ్రామా అని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం నాలుగు పథకాల పేరుతో మండలంలో ఒక గ్రామాన్ని ఎంచుకుని పథకాలు అందించడం సరియనది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాగు రైతులకు ఒకేసారి రైతుబంధు నగదు జమచేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రైతులు నానా అవస్థలు పడుతున్నారని వివర్శించారు. ప్రజలు మళ్లీ సీఎంగా కేసీఆర్‌నే కోరుకుంటున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు రావుల సోమయ్య, పోగు వెంకటేశ్వర్లు, ఊకే రామనాథం, బుడగం రాము, భైరిశెట్టి చిరంజీవి, కనకయ్య, ఫజల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పరాక్రమ్ దివస్

బహుమతులు అందజేస్తున్న దృశ్యం

పాల్వంచ, జనవరి 28 : నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో పాల్వంచ నెహ్రూనగర్‌లోని టీటీడబ్ల్యూఆర్‌టీసీ కళాశాలలో మంగళవారం పరాక్రమ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా యువజన అధికారి భూక్యా ప్రవీణ్‌సింగ్ ఆదేశాల మేరకు అకౌంట్స్ అండ్ ప్రోగ్రాం ఆఫీసర్ కమర్తపు భానుచందర్ ప్రోత్సాహంతో ప్రిన్సిపాల్ అనురాధ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. నేతాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువతకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ సంగీత, లక్ష్మి, నాగేశ్వరరావు, విజయకుమారి పాల్గొన్నారు.

రామయ్యకు బంగారు ఆభరణాలు బహూకరణ

బంగారు ఆభరణాలు వితరణ చేస్తున్న భక్తులు

భద్రాచలం, జనవరి 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో స్వామివారికి, అమ్మవారికి దాతలు మంగళవారం బంగారు ఆభరణాలు బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన సుదర్శనరెడ్డి, అరుంధతి దంపతులు సీతారామచంద్రస్వామివార్లకు రూ.5లక్షల విలువైన కాసుల పేరు, గొలుసు, పచ్చరాయి(బంగారు ఆభరణాలు) వితరణగా అందజేశారు. వీటిని ఆలయ అధికారులకు దంపతులు అందజేశారు. అదేవిధంగా సింహాచలానికి చెందిన రామ్ కుమార్ రూ.1.18 లక్షల విలువైన నాలుగు బంగారు గాజులను వితరణ చేశారు.

భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం

భద్రాచలం, జనవరి 28: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం అర్చకులు స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాతసేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్య బలిహరణం తదితర నిత్యపూజలు నిర్వహించారు. గాలిగోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు.

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే కోరం

ఖమ్మం కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం

ఇల్లెందు, జనవరి 28 : ఇల్లెందు నియోజకవర్గ పరిధిలోని కామేపల్లి మండలంలో ఉన్న పలు సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి తన నియోజకవర్గ పరిధిలో ఉన్న కామేపల్లి మండల సమస్యలను వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఇల్లెందు, జనవరి 28 : ఇల్లెందు నియోజకవర్గంలోని అర్హులైన రైతులందరికీ రైతు భరోసా వస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం ఇల్లెందు పట్టణం, టేకులపల్లి మండలాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. ఇల్లెందు పట్టణంలో గోవింద్‌సెంటర్ నుంచి జగదాంబసెంటర్ వరకు ఎడ్లబండ్లపై ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం, జనవరి 28: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మంగళవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో గంటా వరప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ సర్వేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

హెల్త్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

ఇల్లెందు రూరల్, జనవరి 28 : సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలో పని చేసిన విశ్రాంత ఉద్యోగులు సీపీఆర్ఎంఎస్(హెల్త్‌కార్డు)లకు దరఖాస్తు చేసుకోవాలని ఇల్లెందు ఏరియా జీఎం కృష్ణయ్య అన్నారు. మంగళవారం జీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇల్లెందు ఏరియా విశ్రాంత ఉద్యోగులు ఈ సదావకాశాన్ని మార్చి 31లోపు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

అశ్వారావుపేట(ములకలపల్లి), జనవరి 28 : ములకలపల్లి మండలంలోని అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలని సీపీఐ ఎంఎల్-న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి గౌని నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలకై ఫిబ్రవరి 20న 'చలో హైద్రాబాద్' కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

దుప్పట్లు పంపిణీ

అశ్వారావుపేట (ములకలపల్లి), జనవరి 28: ప్రజా సంక్షేమంలో దాతల భాగస్వామ్యం అవసరమని ములకలపల్లి ఎస్సై కిన్నెర రాజశేఖర్ అన్నారు. ములకలపల్లి మండలంలోని పాలవాగు, ఒర్రె గుంపు గ్రామాల ఆదివాసీలకు జేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు.

వ్యాసరచన పోటీల్లో ఎస్సై ప్రతిభ

అన్నపురెడ్డిపల్లి, జనవరి 28 : పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవాన్ని పురస్కరించుకొని గత ఏడాది డిసెంబర్‌లో సౌండ్ మైండ్ ఇన్ సౌండ్ బాడీ అనే అంశంపై వ్యాసరచన పోటీల్లో అన్నపురెడ్డిపల్లి ఎస్సై చంద్రశేఖర్ రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ డాక్టర్ జితేందర్ రూ.25 వేల నగదు, ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.

క్షేత్ర సందర్శనతో నైపుణ్యం పెంపు

క్షేత్ర సందర్శన చేస్తున్న విద్యార్థులు

అశ్వారావుపేట, జనవరి 28 : క్షేత్ర సందర్శనతోనే విద్యపై పూర్తి నైపుణ్యం పెంపొందుతుందని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్పందన స్పష్టం చేశారు. మార్కెట్ విధానంపై అధ్యయనం చేసినప్పుడు అవగాహన కలుగుతుందన్నారు. మండలంలోని పెదవాగు ప్రాజెక్టు కళాశాల విద్యార్థులు వినాయకపురంలో స్టడీ టూర్‌లో భాగంగా మంగళవారం దుకాణాలు, బ్యాంకులు, ఆలయాలను సందర్శించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గోపాల్, సరిత, మహేశ్వరి, వెంకటలక్ష్మి, హైమావతి పాల్గొన్నారు.

గోదావరి జలాలు అందించాలి

ఇల్లెందు, జనవరి 28 : ఇల్లెందు, మహబూబాబాద్, డోర్నకల్, వైరా, గుండాల నియోజకవర్గ రైతులకు గోదావరి జలాలు అందించాలని అఖిలపక్ష రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. మంగళవారం ఇల్లెందు పట్టణం సీపీఐ కార్యాలయంలో రాజకీయ పార్టీల అఖిలపక్ష సమావేశం దేవరకొండ శంకర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మాజీ ఇల్లెందు ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, బంధం నాగయ్య, గోపగాని శంకర్ రావు, బండారి మోహన్‌రావు మాట్లాడారు. బయ్యారం పెద్ద చెరువులోకి నీరు అందించడం, రోళ్లపాడు, రుక్మాతండా చెరువుని పెద్ద రిజర్వాయర్‌గా ఏర్పాటు చేసి గిరిజన ప్రాంతాల రైతులకు నీరు అందించకుంటే అఖిలపక్షం ఆధ్వర్యంలో పోరాడతామని హెచ్చరించారు. శ్రీనివాస్, యాకుబ్ షావలి, మోహన్‌రావు, కాంతారావు, సాంబమూర్తి పాల్గొన్నారు.

డైరీ ఆవిష్కరణ

పాల్వంచ, జనవరి 28 : తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ 2025 డైరీని కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ప్రభాకర్‌రావు మంగళవారం ఆవిష్కరించారు. కేటీపీఎస్ 5,6 దశల ఇంజినీర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఏడాది బాగా కష్టపడి పనిచేసి కేటీపీఎస్ 5,6 దశను టీజీ జెన్కోలో అగ్రభాగాన నిలబెట్టాలని కోరారు. ఎస్ఈలు వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ధర్మారావు, కృష్ణ, మోక్షవీర్, డీవైసీసీ రామారావు పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

పాల్వంచ, జనవరి 28 : పాల్వంచ పట్టణ పరిధిలోని నవభారత్ పాఠశాల 45వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక నవనగర్‌లోని నవకళా భారతిలో మంగళవారం వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా డైరెక్టర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ జేఎన్‌టీయూ హైదరాబాద్ కామాక్షి ప్రసాద్ పాల్గొని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ ఎంవీ శ్రీనివాసరెడ్డి పాఠశాల వార్షిక నివేదికను సమర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందజేశారు.

ప్రకృతి పరిశీలనపై విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్

ఫీల్డ్ ట్రిప్‌కు వెళుతున్న విద్యార్థులు

దుమ్ముగూడెం, జనవరి 28: తెలంగాణ గ్రీన్‌కార్ప్స్ ఆధ్వర్యంలో జాతీయ హరిత దళం కార్యక్రమంలో భాగంగా దుమ్ముగూడెం కస్తూర్బా గాంధీ పాఠశాలలో నేచర్ క్యాంప్ నిర్వహించగా జిల్లా సైన్స్ అధికారి చలపతిరావు ప్రారంభించారు. 8, 9 తరగతుల విద్యార్థినులతో మూడు రోజులు ఫీల్డ్ ట్రిప్‌కి తీసుకువెళ్లి నేల భూసారం, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులకు గ్రీన్ కార్ప్ కిట్లను అందించి ర్యాలీ నిర్వహించారు. తొలిరోజు దుమ్ముగూడెంలో ఫారెస్ట్ నర్సరీ, హైడల్ ప్రాజెక్టును సందర్శించి విద్యార్థులకు వాటిపై అవగాహన కల్పించారు. రాజశేఖర్, సున్నం సమ్మయ్య, శోభారాణి, ఏజే ప్రభాకర్, రామారావు, టీవీ సురేష్, శ్రీనివాస్, సుజాత, దుర్గ, విద్యార్థినులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలను పెంచాలి

ఇల్లెందు రూరల్, జనవరి 28 : సింగరేణి ఇల్లెందు ఏరియాలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని టీయూసీఐ అనుబంధ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్ షావలి అన్నారు. మంగళవారం ఏరియాలోని జేకే 5 కాంట్రాక్టు కార్మికుల మస్టర్ల అడ్డా వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 31న ఇల్లెందులోని ఎల్లన్న భవనంలో జరిగే సింగరేణి కాంట్రాక్టు కార్మికుల 2వ మహాసభకు కాంట్రాక్టు కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డిబోయిన గోపి, సంతు, యుగంధర్, జాన్‌రాజ్, మందపద్మ, శ్యామల, సునీత, సుమిత్ర పాల్గొన్నారు.

దుకాణాదారుడిపై కేసు నమోదు

అశ్వారావుపేట, జనవరి 28: బాల కార్మికుడితో పని చేయిస్తున్న ఒక దుకాణదారుడిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని వినాయకపురం గ్రామంలో 'ఆపరేషన్ ముస్కాన్'లో భాగంగా దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఒక ఆటోమొబైల్ దుకాణంలో 15 ఏళ్ల బాలుడు పని చేస్తున్నట్లు గుర్తించారు. దుకాణదారుడు వెంకన్నబాబుపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్సై యయాతి రాజు తెలిపారు. తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి బాలుడిని అప్పగించారు.

'యువత గంజాయికి బానిస కావొద్దు'

అవగాహన కల్పిస్తున్న మధుమోహన్‌రెడ్డి

కొత్తగూడెం టౌన్, జనవరి 28 : యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దని, డ్రగ్స్, గంజాయికి అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని నార్కోటిక్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్ మధుమోహన్‌రెడ్డి అన్నారు. సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అబ్దుల్‌కలాం ఇంజినీరింగ్ కాలేజీలో యాంటీ డ్రగ్ డ్రైవ్ నిర్వహించారు. తప్పు చేస్తే ఎంతటి వారినైనా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో చుంచుపల్లి సర్కిల్ పరిధిలోని సీఐ, ఎస్సైలు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

టేకులపల్లి, జనవరి 28 : అనుమతులు లేకుండా ఇసుకను రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్టు అధికారులు పట్టుకున్న ఘటన సంపత్‌నగర్ సమీపాన చోటుచేసుకుంది. మంగళవారం కొత్తగూడెం ఫారెస్టు డీఆర్‌వో రామకృష్ణ ఆధ్వర్యంలో గంగారం గ్రామ పంచాయతీ పరిధి సంపత్‌నగర్ గ్రామ సమీపాన ముర్రేడు వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా పట్టుకొని కొత్తగూడెం ఫారెస్టు కార్యాలయంలో అప్పగించారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి

ఇల్లెందు రూరల్, జనవరి 28: ప్రజా సమస్యలపై పోరాడేందుకు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా జాతీయ నాయకురాలు రాయల రమక్క పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని కొమరారం గ్రామ పంచాయతీలో సీపీఐ ఎంఎల్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో పేదలు మరింత పేదలవుతున్నారని, నరేంద్రమోదీ ప్రభుత్వం బడా బాబులకు కొమ్ముకాస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడం లేదన్నారు. చంద్ర అరుణ, అజ్మీర బిచ్చ, ఈసం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన మాజీ కౌన్సిలర్లు

మాజీ మంత్రిని సన్మానిస్తున్న మాజీ కౌన్సిలర్లు

కొత్తగూడెం అర్బన్, జనవరి 28 : నియోజకవర్గంలోని కొత్తగూడెం మున్సిపాలిటీ పాలకవర్గం పూర్తి అయిన సందర్భంగా పాల్వంచలోని మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావును మంగళవారం మాజీ కౌన్సిలర్లు మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు అంబుల వేణుగోపాల్, కేశంశెట్టి సుజాత, వేముల ప్రసాద్‌బాబు, మాజీ కో ఆప్షన్ మెంబర్ దూడల బుచ్చయ్య, దూడల కిరణ్ కలిశారు.

అర్హులందరికీ పథకాలు అందించాలి

అశ్వారావుపేట, జనవరి 28 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కమిటీ బాధ్యులు సయ్యద్ సలీమ్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రామకృష్ణ, జలాల్, అర్జునరావు, సత్యవతి, రిజ్వానా, దిల్షాద్, సూర్యకుమారి పాల్గొన్నారు.

మంద కృష్ణకు అవార్డు రావడంపై హర్షం

మణుగూరు టౌన్, జనవరి 28: ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు అందుకున్న సందర్భంగా మణుగూరు అంబేద్కర్ సెంటర్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వాసిరెడ్డి చలపతి, కొమ్ము హుస్సేన్ మాదిగ, బోయిల్లా వెంకటేఉశ్వర్లు, నరసింహారావు, చిట్యాల రజిత, ఉసికల కొండయ్య, మోదుగు వెంకటేశ్వర్లు, దేపాక నరసయ్య, మంద కృష్ణ, బాసిపోగు వెంకటేశ్వర్లు, బోయిల సత్యం, పోడుతూరి కల్యాణ్ పాల్గొన్నారు.

మున్సిపల్ పాలకవర్గం సభ్యులకు సన్మానం

రామవరం, జనవరి 28 : రామవరం టీబీజీకేఎస్ కార్యాలయంలో సోమవారం రాత్రి జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ కౌన్సిల్ పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ కాపు కృష్ణ, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ కాసాని వీరభద్రం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ వైస్ చైర్మన్ వేల్పుల దామోదర్, ఎంపీపీ బదావత్ శాంతి, ఎంపీటీసీ కూసన వీరభద్రం, వార్డు కౌన్సిలర్లు వేముల ప్రసాద్, బండారి రుక్మాంగదర్ రావు, అంబుల వేణుగోపాల్, దూడల బుచ్చయ్య, కేశంశెట్టి సుజాతను సన్మానించారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి

దుమ్ముగూడెం, జనవరి 28: మండల పరిధిలోని రామకృష్ణాపురం పంచాయతీ పరిధి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నర్సాపురానికి వస్తున్న 6 నుంచి 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో హెచ్ఎం బెక్కంటి శ్రీనివాసరావు మంగళవారం ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థుల ప్రగతి, ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల మౌలిక సదుపాయాలపై తల్లిదండ్రులతో చర్చించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్ కెజియ, రామకృష్ణాపురం హెచ్ఎం సౌజన్య పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

CHANGE OF NAME

★I, MOHAMMAD JABEENA (Old Name) R/o. H.No.10-3-139, NEHRU BASTHI, KOTHAGUDEM, BHADRADRI KOTHAGUDEM, DIST TELANGANA-507101 changed my name as a SHAIK JABEEN (New Name) W/o SHAIK SABEER PASHA
KMM

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉపాధ్యాయుల నిరసన

టేకులపల్లి, జనవరి 28 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏప్రిల్ 1, 2025 నుంచి యూనిఫైడ్ పెన్షన్ స్కీం పేరుతో ఉద్యోగుల జీవితాలను చిన్నాభిన్నం చేయాలని చూస్తున్నాయని ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. మంగళవారం టేకులపల్లి మండలంలో పలు పాఠశాలల్లో టీఎస్‌సీపీఎస్ఈయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు యూపీఎస్ ప్రతులను కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయుల సంఘం నాయకులు నాగునాయక్, రమణ, పూల్‌సింగ్, వీరన్న, రమేష్, హతీరాం, మోహన్, రవి, బాలు పాల్గొన్నారు.

పెంచిన మెస్ చార్జీలను అమలు చేయాలి

టేకులపల్లి, జనవరి 28 : హాస్టళ్లలో పెంచిన మెస్ చార్జీలను వెంటనే అమలు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.భరత్ డిమాండ్ చేశారు. మంగళవారం టేకులపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఐటీడీఏ ద్వారా అధిక నిధులు కేటాయించాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు అరుణ్, లోకేష్, నవీన్, చందు పాల్గొన్నారు.

ముసలయ్యపై దాడి చేసిన వారిని శిక్షించాలి

బూర్గంపహాడ్, జనవరి 28: పాల్వంచలోని శ్రీనివాసకాలనీకి చెందిన చిటికెన ముసలయ్య పంటకు నీరుపెట్టేందుకు వెళ్లగా పాల్వంచకు చెందిన సముద్రాల సైదులు, రామకృష్ణ, కోటిపల్లి సాయిబాబు, ఆయన కుమారులు రమేష్, మహేష్ అనుచరులు 40 మంది ముసలయ్యపై దాడి చేశారని, దీనికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని బూర్గంపహాడ్, లక్ష్మీపురం రజకవృత్తిదారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నిమ్మల నాగేష్, అప్పారావు, దుర్గారావు, తాటికొండ కృష్ణ, శ్రీను, ఉపేందర్, కె.శ్రీను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముసలయ్యపై దాడిచేయడం హేయనీయమని, అలాంటి వారు ఎవరైనా వారిపై పోలీసులు చట్టపరంగా శిక్షించాలన్నారు.

అశ్వారావుపేట టౌన్, జనవరి 28 : రజకులపై అకారణంగా దాడులు చేస్తున్న వారిని కఠినంగా శిక్షించాలని అశ్వారావుపేట రజక సంఘం మంగళవారం డిమాండ్ చేసింది. పాల్వంచ సమీపంలోని శ్రీనివాస కాలనీకి చెందిన ముసలయ్యపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారని, వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఎస్సై యయాతిరాజుకు సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదినారాయణ, శ్రీను, సాయి, బుచ్చిబాబు, నారాయణ పాల్గొన్నారు.

పీసా నిబంధనలు పాటించాలి

అశ్వారావుపేట టౌన్, జనవరి 28 : గిరిజన ప్రాంతాల్లో పీసా చట్టం ప్రకారం గిరిజనులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని మండల ఆదివాసీ సేన నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు.

చైర్మన్‌పై దాడికి ఖండన

లక్ష్మీదేవిపల్లి, జనవరి 28 : రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, చైర్మన్‌పై సోమవారం రైతుల ముసుగులో కొంతమంది అపరిచిత వ్యక్తులు దాడి చేయడాన్ని కొత్తగూడెం ఏఎంసీ సిబ్బంది, కార్యదర్శి వెంకటేశ్వర్లు తీవ్రంగా ఖండించారు.

ఇల్లెందు, జనవరి 28 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మార్కెట్ కమిటీ కార్యదర్శిపై దాడిని ఇల్లెందు మార్కెట్ కమిటీ అధ్యక్షుడు బానోత్ రాంబాబు, కార్యదర్శి నరేష్ ఖండించారు. మంగళ వారం ఇల్లెందు మార్కెట్ యార్డులో ప్రత్యేక శ్రేణి కార్యదర్శి సుచిత ఆధ్వర్యంలో మార్కెట్ సిబ్బంది ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలిపారు.

ఫిబ్రవరి 20న చలో హైదరాబాద్

టేకులపల్లి, జనవరి 28 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 20వ తేదీన సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే 'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలని మండల కార్యదర్శి కల్తీ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం టేకులపల్లి మండల తొమ్మిదోమైలుతండా గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చండ్రుగొండ, జనవరి 28 : మండల పరిధిలోని తిప్పనపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై శివరామకృష్ణ తన సిబ్బందితో కలిసి మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాటరాయుళ్లు, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.5160 నగదు పట్టుపడినట్లు ఎస్సై తెలిపారు.

ఆత్మీయ భరోసా పథకం రీ సర్వే చేయాలి

బూర్గంపహాడ్, జనవరి 28: భూమిలేని నిరుపేద కుటుంబాలకు భరోసా కల్పించాలని ప్రభుత్వం చేపట్టిన ఆత్మీయ భరోసా పథకాన్ని మండలంలో రీ సర్వే చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు పున్నంచంద్ డిమాండ్ చేశారు. ఆత్మీయ భరోసా ఎంపికలో తెలిసి చేస్తున్నారా... తెలియక చేస్తున్నారో అర్థంకావడం లేదన్నారు. వెంటనే ఈ పథకం రీ సర్వే మండలంలో నిర్వహించి అర్హులను ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు.